సాక్షి
అనంతపురం
గురువారం । 18 । సెప్టెంబర్ । 2025





**చీనీ టన్ను రూ.18 వేలు**

అనంతపురం మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు, కనిష్టం రూ.7 వేలు పలికాయి.



**టమాట కిలో రూ.15**

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.15, కనిష్టం రూ.8, సరాసరి రూ.12 చొప్పున క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.4°/21.7°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

## న్యూస్‌రీల్

### సెంట్రల్ యూనివర్సిటీని సందర్శించిన 'చైనా' బృందం



చైనా రాయబార ప్రతినిధులతో భేటీ అయిన సెంట్రల్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ ఎస్ఏ కోరి

**అనంతపురం :** సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ(సీయూఏపీ)ని చైనా రాయబార కార్యాలయ ప్రతినిధుల బృందం, కౌన్సిలర్ యాంగ్ సీయుహువా బుధవారం సందర్శించారు. ఈ బృందంలో ఫస్ట్ సెక్రటరీ జాంగ్ హైలిన్, సెకండరీ సెక్రటరీ మిస్సు సూ చెన్, థర్డ్ సెక్రటరీ ఫాంగ్ బిన్ ఉన్నారు. వీసీ ప్రొఫెసర్ ఎస్ఏ కోరిని కలిసి.. విద్యలో పరస్పర సహకారంపై చర్చలు జరిపారు. ఇందులో విద్యార్థుల పరస్పర మార్పిడి, అధ్యాపకుల సహకారం, కోర్సుల నిర్వహణ వంటి అంశాలు చర్చకు వచ్చాయి. చైనా భాషలో డిగ్రీ, డిప్లొమో ప్రోగ్రాంలు ప్రారంభించడానికి గల అంశంపై సన్నాహాలు జరుగుతున్నాయి. చైనా ప్రభుత్వం అందించే ఉపకార వేతన పథకం గురించి వివరించారు. కార్యక్రమంలో సీయూఏపీ ఫారిన్ అఫైర్స్ డైరెక్టర్ డాక్టర్ బాబు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### 11 మండలాల్లో వర్షం

**అనంతపురం అగ్రికల్చర్:** జిల్లా వ్యాప్తంగా 11 మండలాల పరిధిలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు వర్షం కురిసింది. 5 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. ఇందులో నార్పల 62.6 మి.మీ, యల్లనూరు 18.6, కూడేరు 17.4, గార్లదిన్నె 14.4, బుక్కరాయసముద్రం11.1 మి.మీ వర్షం పడగా.. ఉరవకొండ, బొమ్మనహాళ్, అనంతపురం, శింగనమల, ఆత్మకూరు తదితర మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. సెప్టెంబర్ నెల సాధారణ వర్షపాతం 110.9 మి.మీ కాగా ప్రస్తుతానికి 66.8 మి.మీ నమోదైంది.

### 30 లోపు ఈ-పంట నమోదు చేయించుకోండి



మొక్క జొన్న విత్తే పరికరాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

**బుక్కరాయసముద్రం/ గార్లదిన్నె:** జిల్లా వ్యాప్తంగా రైతులు ఈ నెల 30లోపు ఈ-పంట నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమా మహేశ్వరమ్మ తెలిపారు. బుధవారం మండల కేంద్రం బుక్కరాయసముద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ రైతులు ఏయే పంటలు సాగు చేశారో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. తద్వారా పంట నష్టపోతే ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం మొక్కజొన్న విత్తే పరికరాలను పరిశీలించారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి, మండల వ్యవసాయ అధికారి శ్యాంసుందర్‌రెడ్డి, ఉద్యాన సహాయకురాలు విజయశాంతి, రైతులు పాల్గొన్నారు. అలాగే గార్లదిన్నెలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి హాజరై రైతులకు సూచనలు ఇచ్చారు.

### విశ్వకర్మ స్ఫూర్తితో సాగాలి



మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

**అనతపురం రూరల్:** విశ్వకర్మ భగవానుని జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని నేటి తరం ముందుకు సాగాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సూచించారు. బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం పాతూరులోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీ, జెడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణశర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వకర్మ గొప్ప శిల్పి అని కొనియాడారు. నేటి యువత విశ్వకర్మ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని నైపుణ్యాభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మలోల, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ స్వప్న, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంగాచారి పాల్గొన్నారు.

# వణికిస్తున్న జ్వరాలు



ఊరూరా జ్వరాలు వణికిస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రైవేట్ ఆస్పత్రులే కాదు ఆర్ఎంపీల ప్రథమ చికిత్స కేంద్రాలకు బాధితులు పోటెత్తుతున్నారు. ఏ ఆస్పత్రి చూసినా కిక్కిరిసి ఉన్నాయి. మొన్నటికి మొన్న ఉరవకొండ నియోజకవర్గం విడపనకల్లు మండలంలో ఒకే ఇంట్లో ముగ్గురు పిల్లలు డెంగీ బారిన పడటంతో బళ్లారి ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. తాజాగా గుత్తి ఆర్ఎస్‌లో ఇద్దరు చిన్నారులు డెంగీ జ్వరంతో ప్రాణాలు కోల్పోవడం ఆందోళన రేపుతోంది.



గుంతకల్లు ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షల కోసం బారులు తీరిన రోగులు



అనంతపురం సర్వజనాస్పత్రి చిన్నపిల్లల వార్డులో ఒక్కో మంచంపై ముగ్గురు చిన్నారులు చికిత్స పొందుతున్న దృశ్యం

- ప్రతి ఆస్పత్రిలోనూ జ్వరపీడితులే
- తాజాగా గుత్తిలో ఇద్దరు చిన్నారులు డెంగీతో మృతి
- బాధితుల్లో ఐదేళ్లలోపు చిన్నారులు ఎక్కువగా ఉన్నట్టు గణాంకాలు
- ప్రైవేటు వైద్య ఖర్చులతో హడలిపోతున్న సామాన్యులు
- గడిచిన వారం రోజుల్లో 50వేల మందికి జ్వరాలు

**సాక్షి ప్రతినిధి, అనంతపురం:** ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వాస్పత్రులు జ్వరాల బాధితులతో కిటకిటలాడుతున్నాయి. ఒక్కో ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి సగటున 40 నుంచి 50 మంది ఔట్‌పేషెంట్లు చికిత్సకు వస్తే అందులో 15 మంది వైరల్ జ్వర పీడితులే ఉంటున్నారు. అనంతపురం సర్వజనాస్పత్రిలో రోజూ 250 మందికి పైగా జ్వరబాధితులు చికిత్సకు వస్తున్నారు. చాలామంది చలి జ్వరంతో నడవలేని స్థితిలో ఉంటున్నారు. అలాంటి వారిని ఇన్‌పేషెంట్లుగా చేర్చుకుని చికిత్స అందించాల్సిన పరిస్థితి వస్తోంది. పడకలు సరిపడక కొంతమంది ప్రైవేటు ఆస్పత్రులకు వెళుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు- చికిత్సల ఖర్చులు భారీగా ఉండటంతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. గడిచిన వారం రోజుల్లోనే 50వేలమంది జ్వరాల బారిన పడినట్లు అంచనా. అందులోనూ చిన్నారులు కూడా జ్వరాలతో విలవిలలాడిపోతుండటం తల్లిదండ్రులను కలవరపెడుతోంది.

**చిన్నారులతో ప్రైవేటు ఆస్పత్రుల రద్దీ**

జ్వరాల బారిన పడుతున్న వారిలో ఎక్కువ మంది ఐదేళ్లలోపు చిన్నారులు ఉంటున్నారు. అనంతపురం సాయినగర్‌లోని ఓ చిన్నపిల్లల ప్రైవేటు ఆస్పత్రిలో జ్వరాలతో చేరిన చిన్నారులు భారీ సంఖ్యలో ఉన్నారు. ఒక్కో చిన్నారికి రూ.500 ఔట్‌పేషెంటు ఫీజు వసూలు చేస్తుండటంపై తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రక్తపరీక్షలు, నెబులైజర్ల పేరిట రెండు మూడు రోజులకే రూ.15వేల వరకూ వసూలు చేస్తున్నట్టు వాపోతున్నారు.

### డెంగీతో ఇద్దరు చిన్నారుల మృతి

గుత్తి ఆర్ఎస్‌లో తాత వద్ద ఉంటూ చదువుకుంటున్న సంయుక్త అనే ఏడేళ్ల అమ్మాయి ఆరు రోజుల క్రితం డెంగీతో కర్నూలులో చికిత్స పొందుతూ మృతిచెందింది. పాప తల్లిదండ్రులు ముదిగుబ్బలో నివాసం ఉంటారు. గుత్తికే చెందిన రెండేళ్ల హర్షిత్ అనే బాలుడు బుధవారం డెంగీతో మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. కానీ అనంతపురం జిల్లాలో డెంగీ మరణాలు లేవని, ఇప్పటివరకూ 37 కేసులు మాత్రమే నమోదయ్యాయని అధికారులు చెబుతున్నారు.

### సాధారణ ధరలు...ప్రైవేటు ఆస్పత్రులు తీసుకుంటున్నది

| జ్వరం | టెస్టుకు అయ్యే ఖర్చు | వసూలు చేస్తున్నది |
|---|---|---|
| డెంగీ | రూ.750 (అన్ని టెస్టులు) | రూ.2వేల నుంచి రూ.3వేలు |
| టైఫాయిడ్ టెస్ట్‌కిట్ | రూ.450 (వందమందికి చేయొచ్చు) | ఒక్కొక్కరి నుంచి రూ.300 |
| మలేరియా | రూ.150 | రూ.400 నుంచి రూ.500 |
| సీబీపీ | రూ.100 | రూ.250 నుంచి రూ.300 |
| ఇన్‌పేషెంటు | రూ.2 వేలు (రోజుకు) | రూ.4వేల నుంచి రూ.5వేలు |
| ఔట్‌పేషెంటు ఫీజు | రూ.200 | రూ.500 |



అనంతపురం సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళలు

### జ్వరంతో ఆసుపత్రికి వచ్చాం



మా ఊరిలో చాలా మందికి జ్వరాలు వస్తున్నాయి. నాకు కూడా జ్వరం రావడంతో శింగనమల ఆస్పత్రికి వచ్చాను. ఇక్కడ రక్త పరీక్షలు చేశారు. విష జ్వరమని చెప్పారు. ఇక్కడే అడ్మిట్ అయ్యాం. సూదులు, మందులు వేస్తున్నారు.

– వెంకటరెడ్డి, పెద్దమట్లగొంది, శింగనమల మండలం

### ఏమి జ్వరమో.. తగ్గడమే లేదు



నేను వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాను. రోజూ ఆస్పత్రికి వచ్చి సూదివేయించుకుని, మందులు తీసుకుంటున్నాను. ఏమి జ్వరమో ఏమో తెలియదు గానీ తగ్గడమే లేదు. ఇంకెన్నిసార్లు ఆస్పత్రికి రావాలో ఏమో..!

– లింగమ్మ, కుర్లపల్లి, కళ్యాణదుర్గం మండలం

### ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నా



తీవ్ర జ్వరంతో 10 రోజుల క్రితం ఉరవకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాను. కుటుంబ సభ్యులతో కలిసి ఇక్కడే ఉంటున్నాను. మా కమ్మూరు గ్రామంలో చాలామంది జ్వరాలతో బాధపడుతున్నారు. కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకునే మేము ఇలా రోజుల తరబడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నాం.

– ప్రతాప్, కమ్మూరు, కూడేరు మండలం

### జాగ్రత్తలు పాటించాలి



వర్షంలో తడవటం, చల్లటి వాతావరణంలో ఉండటం వంటి కారణాల వల్ల దగ్గు, జలుబుతోపాటు కీళ్ల నొప్పులతో కూడిన జ్వరాలు ఎక్కువగా వస్తున్నాయి. గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి వచ్చే వందలాది రోగుల్లో సగం మందికి పైగా ఇలాంటి జ్వరాలతో బాధపడుతున్నవారే ఉన్నారు. ఇంటి పరిసరాల్లో మురుగు నీరు నిల్వలు లేకుండా, దోమలు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా వేడి ఆహార పదార్థాలనే భుజించాలి. రాత్రి పూట చల్లటి వాతావరణం బారిన పడకుండా శరీరం కవర్ చేసేలా వస్త్రాలు ధరించడం, దోమ తెరలువాడటం చేయాలి. రోగాల బారిన పడితే నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్‌ను సంప్రదించాలి.

– జయవర్ధన్‌రెడ్డి, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్, గుంతకల్లు

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దుర్మార్గం

- ప్రజా ఉద్యమం తప్పదు
- రేపు 'చలో వైద్య కళాశాల'
- ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

**అనంతపురం మెడికల్:** ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ – పీపీపీ విధానం దుర్మార్గమని ఉరవకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం చేపడతామని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం ఆయన అనంతపురంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పేదలకు వైద్యవిద్య.. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను మంజూరు చేయించారని గుర్తు చేశారు. ఇందులో ఐదు కళాశాలలు ప్రారంభించారన్నారు. మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఇటువంటి తరుణంలో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కారు నూతన మెడికల్ కాలేజీల నిర్వహణ చేపట్టలేమని.. వాటిని ప్రైవేటీకరించాలని పీపీపీ విధానం తీసుకొచ్చిందని మండిపడ్డారు. గతంలోనూ ప్రైవేట్ వైద్య కళాశాలలను తీసుకురావాలని చూస్తే పెద్ద ఎత్తున ఉద్యమాలు జరిగాయని, అప్పటి సీఎం జనార్దన్‌రెడ్డి రాజీనామా చేయాల్సి వచ్చిందని తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే జనార్దన్‌రెడ్డికి పట్టిన గతే చంద్రబాబుకు కూడా పడుతుందని హెచ్చరించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో విద్యార్థి, యువజన సంఘాలతో కలిసి ఈ నెల 19న 'చలో ప్రభుత్వ వైద్య కళాశాల' కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

**దిగజారుడు రాజకీయాలు తగదు**

నూతన ప్రభుత్వ వైద్య కళాశాలల భవనాల నిర్మాణం అసంపూర్ణంగా ఉన్నాయంటూ మంత్రులు వితండవాదం చేయడమేంటని విశ్వేశ్వరరెడ్డి ప్రశ్నించారు. ఎక్కడైనా తమ జిల్లాకు మంజూరైన కళాశాలను ప్రైవేటీకరణ చేస్తున్నారంటే.. దానికి వ్యతిరేకంగా పోరాడాల్సిందిపోయి భవనాల వద్దకు వెళ్లి దిగుజారుడు రాజకీయాలు చేయడం తగదన్నారు. ఇక రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తీరు మరీ దారుణంగా ఉందన్నారు. ఆయన ఏనాడూ ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ప్రయతి్నంచిన దాఖలాలు లేకపోగా.. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు.

**ఆర్డీటీని నిర్లక్ష్యం చేస్తే ఎలా?**

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని బడుగుల జీవితాల్లో వెలుగులు నింపిన ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మండిపడ్డారు. ఇటీవల అనంతపురంలో నిర్వహించిన సీఎం చంద్రబాబు సభలో ఆర్డీటీ గురించి ఒక్క ప్రజాప్రతినిధి కూడా మాట్లాడకపోవడం దారుణమన్నారు. ప్రధాని మోదీతో మాట్లాడి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేసి ఆర్డీటీ సంస్థ సేవలు కొనసాగేలా చూడాలని కోరారు. పత్రికా స్వేచ్ఛను హరిస్తూ 'సాక్షి' ఎడిటర్ ధనంజయరెడ్డిపై కేసు నమోదు చేయడం అప్రజాస్వామికమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా నేత నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఠంచన్ జీతాలు ఉత్తిమాటే

- నెలన్నర దాటినా అందని వేతనాలు
- ముఖ్యమైన పండుగలు ఎలా చేసుకునేది?
- కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఎదురుచూపు

**అనంతపురం ఎడ్యుకేషన్:** 'ఈ ప్రభుత్వంలో రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నెలనెలా సక్రమంగా జీతాలు అందడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగులందరికీ ఠంచన్‌గా ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తాం' – ఇదీ ఎన్నికల ముందు కూటమి పార్టీల నాయకులు ఇచ్చిన హామీ. సెప్టెంబరు నెల ప్రారంభమై నేటికి 18 రోజులు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సమగ్రశిక్ష పరిధిలో ని కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు నేటికీ ఆగస్టు నెల జీతం పడలేదు. ఎప్పుడొస్తుందో అధికారులకూ స్పష్టత లేదు. రాష్ట్ర కార్యాలయం నుంచి ఇంకా బడ్జెట్ రాలేదు. ప్రతినెలా ఒకటో తేదీన ఠంచన్‌గా జీతాల చెల్లింపు అనేది ఉత్తిమాటగానే మారింది.

**పండుగల వేళ ఆందోళన**

హిందువుల అతి పెద్ద పండుగల్లో ఒక్కటైన విజయదశమి దగ్గర పడుతుండడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. చాలామంది పెద్దల అమావాస్య (మహాలయ అమావాస్య) చేసుకుంటారు. పితృపక్షంలో పెద్దలకు కొత్త దుస్తులు పెట్టడం ఆనవాయితీ. మరో మూడు రోజుల్లో (ఈ నెల 21) పెద్దల అమావాస్య వస్తుంది. అసలే చిరుద్యోగుల నెలవారి వేతనాలు కుటుంబ నిర్వహణకే సరిపోతాయి. అలాంటిది ఇప్పటిదాకా జీతాలు రాకపోవడంతో చేతిలో చిల్లిగవ్వ లేక పండుగ ఎలా చేయాలో దిక్కుతెలీక తలలు పట్టుకుంటున్నారు. మరో 13 రోజుల్లో (అక్టోబరు 2న) విజయదశమి పండుగ ఉంటుంది. ఇంటిల్లిపాది కొత్త దుస్తులు తెచ్చుకోవడం ఆనవాయితీ.

**మూడు వేలమంది నిరీక్షణ**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు వేల మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు జీతం కోసం ఎదురు చూస్తున్నారు. కేజీబీవీల ప్రిన్సిపాళ్లు, సీఆర్టీలు, పీజీటీలు, పీఈటీలు, కంప్యూటర్, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లు, అటెండర్లు, అకౌంటెంట్లు, వాచ్‌మెన్లు, కుక్‌లు, ఏఎన్ఎంలు, ఎమ్మార్సీల్లో ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంటెంట్లు, మెసెంజర్లు, సీఆర్పీలు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, భవిత కేంద్రాల్లో ఐఈఆర్పీలు, ఫిజియోథెరపిస్టులు, ఆయాలు, సమగ్ర శిక్ష కార్యాలయంలో డేటా అనలసిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్లు, సైట్ ఇంజినీర్లు, డీఎల్ఎంటీలు పని చేస్తున్నారు. వీరంతా జీతాలు పడకపోవడంతో పెద్ద పండగకు దిక్కులు చూసే పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా ఆగస్టు నెల జీతాలకు సంబంధించిన బడ్జెట్ రాలేదని సమగ్ర శిక్ష అధికారులు చెబుతున్నారు. ఇప్పటిదాకా కనీస సమాచారం లేదంటున్నారు.

# వీధికుక్క స్వైరవిహారం

- ముగ్గురు విద్యార్థులకు గాయాలు



వీధి కుక్క దాడిలో గాయపడిన చిన్నారులు

**గుంతకల్లుటౌన్:** వీధికుక్క స్వైరవిహారం చేసి ముగ్గురు విద్యార్థులను గాయపరిచింది. పట్టణంలోని ఎస్‌జేపీ హైస్కూల్ రోడ్ ఈద్గా ఆవరణలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 4వ తరగతి చదువుతున్న మెహనాజ్ బుధవారం స్కూల్ నుంచి ఇంటికి వెళ్తుండగా వెనుకనుంచి వచ్చిన వీధికుక్క ఎడమకాలిపై కరిచింది. అలాగే అదే స్కూల్ విద్యార్థులైన అన్నా, చెల్లెలు భువన తేజ (మూడో తరగతి), కేతన (ఒకటో తరగతి)లను తల్లి నేత్రావతి ట్యూషన్‌కు విడిచిపెట్టడానికి వెళ్తోంది. ఆ సమయంలో భువన తేజను కరవడానికి కుక్క మీదకు రావడంతో తల్లి గమనించి కుమారుడిని పక్కకు నెట్టేసింది. ఆ వెంటనే పక్కనే ఉన్న కుమార్తె కేతన వీపుపై కుక్క కరిచింది. ఆ కుక్కను తరిమివేయడానికి ఆమె ప్రయత్నించగా తిరిగి కుమారుడి వీపుపై కరిచింది. తీవ్ర రక్తస్రావంతో అల్లాడిపోతున్న చిన్నారులిద్దరినీ ఆమె స్థానికుల సహాయంతో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లి వ్యాక్సిన్ వేయించారు. గాయపడిన ఈ ముగ్గురు ఈద్గా ఏరియాకు చెందిన వారు. తమ వీధిలో సుమారు 20 వీధి కుక్కలున్నాయని, ఎన్నిసార్లు చెప్పినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని చిన్నారుల తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలు పోతే కానీ మున్సిపల్ అధికారులు పట్టించుకోరా అంటూ పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# అన్నదాతకు తప్పని యూరియా కష్టాలు



అనంతపురం మండలం తాటిచెర్లలో యూరియా కోసం బారులుదీరిన రైతులు

**అనంతపురం అగ్రికల్చర్:** కూటమి పాలనలో కర్షకునికి కష్టాలు తప్పడం లేదు. అవసరం మేరకు తగినంత యూరియా ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఒకట్రెండు బస్తాల కోసం నెల రోజులుగా అన్నదాతలు పాట్లు పడుతున్నారు. సీజన్ మొదట్లో వచ్చిన యూరియా చాలా వరకు పక్కదారి పట్టించడంతో ఇప్పుడు కొరత ఏర్పడినట్లు రైతులు చెబుతున్నారు. పంటలకు వేసుకోవాల్సిన సమయంలో యూరియా అందుబాటులో లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఆగస్టులో సమృద్ధిగా వర్షాలు పడటంతో వరి, మొక్కజొన్న సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. వేరుశనగ, కంది, పత్తి, ఆముదం, అలాగే అరటి లాంటి ఉద్యాన పంటల విస్తీర్ణం పెరుగుతోంది. దీంతో పంటలకు యూరియా అవసరం ఏర్పడినా తగినంత అందుబాటులో పెట్టడంలో ప్రభుత్వం, వ్యవసాయశాఖ విఫలమైంది. కొరత తీవ్రంగా ఉండటంతో రైతుల దృష్టిని మళ్లించడానికి అవసరానికి మించి యూరియా వాడితే మంచిదికాదని ప్రచారం సాగిస్తున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 32 వేల మెట్రిక్ టన్నులు పంపిణీ చేసినట్లు అధికారులు చెబుతున్నా అందులో జిల్లా రైతులకు చేరింది ఎంతనేది మాత్రం చెప్పడం లేదు. ప్రస్తుతం ఆర్ఎస్‌కేల్లో 340 మెట్రిక్ టన్నులు, సొసైటీల్లో 200 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్ల దగ్గర 550 మెట్రిక్ టన్నులు, మార్క్‌ఫెడ్ పరిధిలో 1,479 మెట్రిక్ టన్నులు, కంపెనీ గోదాముల్లో 110 మెట్రిక్ టన్నులు, రవాణా కింద 500 మెట్రిక్ టన్నుల వరకు ఉన్నట్లు వ్యవసాయశాఖ ప్రకటించినా... క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. బుధవారం కూడా చాలా ఆర్ఎస్‌కేల్లో కొన్నిచోట్ల ఒక బస్తా, మరికొన్ని చోట్ల రెండు బస్తాలు ఇచ్చారు. ప్రైవేట్ డీలర్ల దగ్గర కూడా యూరియా కావాలంటే కాంప్లెక్స్, డీఏపీ, నానో యూరియా లేదా డ్రిప్ ఎరువులు లాంటి ప్రస్తుతానికి అవసరం లేనివి అంటగడుతున్న పరిస్థితి నెలకొంది. యూరియా కష్టాలు ఎప్పుడు తీరుతాయో అనే ఆందోళనలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

## క్లుప్తంగా

### ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 27వ తేదీ వరకు గడువు పొడిగించారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ రాయపరెడ్డి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు https://iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం 28వ తేదీ లోపు ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలి. వెరిఫికేషన్ చేయించుకున్న వారి దరఖాస్తులను మాత్రమే పరిగణలోకి తీసుకుని 29న కౌన్సెలింగ్ చేపట్టి సీట్లు భర్తీ చేస్తారు.

### మూడేళ్ల క్రితం ఫిర్యాదు.. తాజాగా కేసు నమోదు

గుత్తి: మూడేళ్ల క్రితం చోటు చేసుకున్న చోరీకి సంబంధించి చేసిన ఫిర్యాదుపై బుధవారం గుత్తి పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడు గ్రామానికి చెందిన రాజేశ్వరి 2022లో గుత్తి బస్టాండ్‌లో బస్సు దిగుతున్న సమయంలో ఆమె మెడలోని నాలుగున్నర తులాల బంగారు చైన్‌ను దుండగులు లాక్కొని ఉడాయించారు. ఘటనపై అప్పట్లోనే బాధితురాలు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. ఈ క్రమంలో బుధవారం రాజేశ్వరికి సంబంధించిన నాలుగున్నర తులాల బంగారు ఆరభణాలు చోరీకి గురైనట్లు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### ద్విచక్ర వాహనం దగ్ధం

తాడిమర్రి: మండలంలోని పుల్లంపల్లి సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకున్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా, ద్విచక్ర వాహనం పూర్తిగా కాలి బూడిదైంది. పోలీసులు తెలిపిన మేరకు.. తాడిమర్రిలోని బీసీ కాలనీకి చెందిన యువకులు ఆర్వేటి ఉమాశంకర్, పూజారప్ప మంగళవారం ద్విచక్ర వాహనంపై ఆర్వేటప్ప స్వామి గుడి నిర్మాణానికి చందాల కోసం ధర్మవరం సమీపంలోని పల్లెలకు వెళ్లారు. రాత్రి తిరుగు ప్రయాణమై వారు పుల్లంపల్లి సమీపంలోకి చేరుకోగానే జేబులోని పేపర్లు కిందపడ్డాయి. దీంతో ద్విచక్ర వాహనాన్ని వెనక్కి తిప్పుకుని వెళుతుండగా ఎదురుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న చిల్లకొండయ్యపల్లి గ్రామానికి చెందిన మద్దినేని శ్రీధర్ నాయుడు ఢీకొన్నాడు. ప్రమాదంలో శ్రీధర్ నాయుడుకు కాలు విరిగింది. ఉమాశంకర్ ద్విచక్ర వాహనం పెట్రోలు ట్యాంక్ పేలి మంటలు ఎగిసి పడి వాహనం పూర్తిగా కాలిపోయింది. క్షతగాత్రుడిని అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

# పరికరాలు లేక .. పనులు సాగక

- ఇబ్బందుల్లో ఉపాధి కూలీలు
- పట్టించుకోని కూటమి సర్కారు
- అలవెన్సులు అందుబాటులోకి తేవాలని డిమాండ్

**ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు పరికరాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి ఉపాధి కూలీల ఇబ్బందులు దూరం చేసే దిశగా సీఎం చంద్రబాబు ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదని కూలీలు మండిపడుతున్నారు.**



పనులు చేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

రాయదుర్గం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కూలీలకు ప్రత్యేక అలవెన్సులతో పాటు పరికరాల పంపిణీ ప్రక్రియ కనుమరుగైంది. పార, పలుగు, నీరు, తట్టలు, నీడ కోసం టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు లాంటి సౌకర్యాలు దూరమయ్యాయి. కేటాయించాల్సిన ప్రత్యేక అలవెన్సులు ఆగిపోయాయి. ఫలితంగా మొద్దుబారిన పరికరాలతో పనులు సాగక .. కొత్తవి కొనుగోలుకు డబ్బుల్లేక ఉపాధి కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.

**కనీస సౌకర్యాలూ కరువే**

జిల్లాలోని 31 మండలాల్లో 2.60 లక్షల జాబ్‌కార్డులు ఉండగా, 4.26 లక్షల మంది ఉపాధి కూలీలు ఉన్నారు. ఏటా 1.15 కోట్లకు పైగా పని దినాలు పూర్తి చేస్తున్నారు. నిబంధనల ప్రకారం మంజూరయ్యే నిధుల్లో కూలీల వేతనాలకు 60 శాతం పోను మిగిలిన 40 శాతం నిధులతో కూలీలకు అవసరమైన పార, పలుగు, తట్టలు, నీడ కోసం టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు కొనుగోలు చేయాల్సి ఉంది. ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ (ఎన్ఐసీ) సర్వర్‌ను అందుబాటులోకి తెచ్చిన తర్వాత ప్రత్యేక అలవెన్సులకు మంగళం పాడింది. ప్రస్తుతం పని ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. చివరకు ప్రథమ చికిత్స కిట్లు సైతం అందుబాటులో లేవు.

| | | |
|---|---|---|
| జిల్లాలో యాక్టివ్ జాబ్‌కార్డులు | 2.60 | లక్షలు |
| నమోదైన కూలీల సంఖ్య | 4.58 | లక్షలు |
| శ్రమశక్తి సంఘాలు | 13,164 | |

**తీరని కూలీల అవసరాలు**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో భవన నిర్మాణాలు, సీసీరోడ్లు ఇతర అభివృద్ధి పనులకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానించి కూలీల సంక్షేమానికి అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు కనిపించడం లేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 17 నెలలు కావస్తున్నా కనీస అవసరాలు తీరక ఉపాధి కూలీలు నానా ఇక్కట్లు పడుతున్నారు. గతంలో ఒక మేట్ పరిధిలో 10 నుంచి 20 మంది లోపు మాత్రమే ఓ గ్రూపుగా పనిచేసేవారు. కూటమి ప్రభుత్వం కొత్తగా శ్రమశక్తి సంఘాల్ని అమల్లోకి తీసుకొచ్చి 30 నుంచి 40 మందిని గ్రూపులుగా చేర్చింది. దీంతో మస్టర్ భారం పెరిగి క్షేత్ర స్థాయి సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**పరికరాలు లేవంటున్నారు**



ప్రత్యేక అలవెన్సులు ఇవ్వడం లేదు. గతంలో తాగునీటితో పాటు పని ప్రాంతంలో నీడ కోసం టెంట్లను ఏర్పాటు చేసేవారు. ఇప్పుడు అలాంటివేవి లేవు. పరికరాలు కూడా లేవంటున్నారు.

– శ్రీరాములు, ఉపాధి కూలీ, పూలకుంట

**ప్రభుత్వం స్పందించాలి**



గతంలో ఏడాదికి రెండు సార్లు గడ్డపారలు అందజేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 17 నెలలు కావస్తున్నా ఒక్కసారి కూడా పరికరాల పంపిణీ జరగలేదు. పని ప్రాంతంలో సౌకర్యాలు లేవు. ప్రథమ చికిత్స కిట్లూ ఉంచడం లేదు. వీటన్నింటిపై ప్రభుత్వం స్పందించాలి.

– వాల్మీకి ఓబన్న, ఉపాధి కూలీ, రంగచేడు

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం**



కూలీలకు పరికరాలు అందజేసే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. ప్రభుత్వం నుంచి పరికరాలు వస్తే అందిస్తాం. పనుల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– సలీమ్‌బాషా, డ్వామా పీడీ, అనంతపురం

### 25 నుంచి ‘ఆంధ్రా యువ సంకల్ప్’

అనంతపురం కల్చరల్: ఈ నెల 25 నుంచి ఐదు రోజుల పాటు ఆంధ్రా యువ సంకల్ప్ 2కె25 పేరుతో డిజిటల్ మారథాన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా యువజన సంక్షేమ అధికారి కార్యాలయం బుధవారం ఓ ప్రకటన జారీ చేసింది. 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసున్న వారు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పాటిస్తూ భాగస్వాములు కావచ్చు. విజేతలకు మొదటి బహుమతి కింద రూ.1 లక్ష, రెండో బహుమతిగా రూ.75వేలు, మూడో బహుమతిగా రూ.50 వేలు అందజేస్తారు. అలాగే మరో 9 మంది విజేతలకు ప్రశంసాపత్రాలను అందించి సత్కరిస్తారు. పూర్తి సమాచారానికి https://www.andhrayuvasankalp.com/ వెబ్‌సైట్‌ను పరిశీలించాలి.

### అమరావతికి 2,100 మంది తరలింపు

- సీఎస్‌కు తెలిపిన కలెక్టర్ ఆనంద్

అనంతపురం అర్బన్: డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 19న అమరావతి వేదికగా నియామక పత్రాలు అందించనున్న నేపథ్యంలో జిల్లా నుంచి 2,100 మందిని పంపించే ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. డీఎస్సీ నియామకాలపై సీఎస్ బుధవారం విజయవాడ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. నియామక పత్రాలు అందించే కార్యక్రమానికి సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను వివరించారు. జిల్లా నుంచి తరలి వెళ్లే అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులు, విద్యాశాఖ అధికారులు మొత్తం 2,100 మందికి 45 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. కాన్ఫరెన్స్‌లో డీఈఓ ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

# వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్
- ‘చలో మెడికల్ కాలేజ్’ విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న సాకే చంద్రశేఖర్

అనంతపురం కార్పొరేషన్: రాష్ట్రంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ స్పష్టం చేశారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి లింగారెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్‌తో కలసి ఆయన మాట్లాడారు. పీపీపీ విధానంలో వైద్య కళాశాల నిర్వహణ చేపట్టాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ చలో మెడికల్ కాలేజ్ పేరుతో ఈ నెల 19న తలపెట్టిన కార్యక్రమాన్ని విజయంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాలను విద్యార్థి, యువజన విభాగం నాయకులు పరిశీలించనున్నట్లు తెలిపారు. 2019 నాటికి రాష్ట్రంలో కేవలం 11 వైద్య కళాశాలు మాత్రమే ఉండేవన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో కొత్తగా 17 వైద్య కళాశాలకు ఆమోదం దక్కిందన్నారు. 2023–24లో ఒకేసారి విజయనగరం, ఏలూరు, రాజమహేంద్రవరం, మచిలీపట్నం, నంద్యాల వైద్య కళాశాలల ద్వారా 750 సీట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. గతేడాది పులివెందులకు మంజూరైన అనుమతులను కూటమి ప్రభుత్వం రద్దు చేసిందని మండిపడ్డారు. ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ యాదవ్ మాట్లాడుతూ.. విద్యను ప్రైవేట్ పరం చేయాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. లింగారెడ్డి, నరేంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉందన్నారు. పేద, సామాన్య మధ్యతరగతి కుటుంబాల జీవితాలతో ఆటలాడుతున్న సీఎం చంద్రబాబుకు బుద్ధి చెబుతామన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దాదాఖలందర్, శ్రీనివాసదత్తా, ఉదయ్, అమరనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# టెట్ నుంచి మినహాయింపునివ్వాలి

- ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నాయకుల డిమాండ్



కలెక్టరేట్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఆపస్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ వృత్తిలో 2011కు ముందు చేరిన వారికి ‘టెట్’ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) నాయకులు కోరారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులందరూ ప్రమోషన్లు తీసుకోవాలన్నా, 2010 తర్వాత ప్రమోషన్లు తీసుకున్న వారందరూ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) తప్పనిసరిగా ఉత్తీర్ణులై ఉండాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. దీంతో దేశవ్యాప్తంగా ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంగ్ నిర్ణయం మేరకు దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సంబంధిత ఉపాధ్యాయ సంఘాల ద్వారా కలెక్టర్లకు వినతి పత్రాలు ఇస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం ఆపస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ అధికారులను కలిసి వినతిపత్రం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. తమ వినతి పత్రాన్ని ప్రధానికి పంపాలని కోరారు. కార్యక్రమంలో ఆపస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజేంద్రప్రసాద్, జిల్లా అధ్యక్షురాలు కళ్యాణి, ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి, ఉపాధ్యక్షులు పి.శివప్రసాద్‌నాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు పోతులయ్య పాల్గొన్నారు.



### వాహనం ఢీ కొని మహిళ మృతి

పామిడి: స్థానిక 44వ జాతీయ రహదారిపై ఓ రెస్టారెంట్ సమీపంలో బుధవారం చోటు చేసుకున్న ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ మృతి చెందింది. మతిస్థిమితం లేని మహిళ(40) రోడ్డు దాటుతున్న సమయంలో బెంగుళూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న వాహనం ఢీకొని దుర్మరణం పాలైంది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనంతో పాటు ఉడాయించాడు. ఘటనపై పామిడి పోలీసులు కేసు నమోదు చేశారు.

### 20 మంది అడ్మిన్లకు షోకాజ్

అనంతపురం కార్పొరేషన్: విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన 20 మంది అడ్మిన్లకు నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. షోకాజ్ తీసుకున్న వారిలో బి.రవి కుమార్, సి.ప్రసాద్, సి.ప్రకాష్‌రెడ్డి, పి.లక్ష్మీకాంత్, జె.గౌతమి గీత, బి.ముత్యాలయ్య, జె.ప్రకాష్, పి.శ్రీహరి, ఎస్.అపర్ణ, ఎం.ఊహ, బి.రియాజ్‌బాషా, వి.రాజేష్‌రెడ్డి, కె.గంగాదేవి, డి.రాజేంద్ర ప్రసాద్, సి.శశికళ, ఎం.శ్రీవాణి, పి.విమలేష్, ఎ.మౌనిక, జి.శ్రీధర్‌రెడ్డి, జె.ఝాన్సీలక్ష్మి ఉన్నారు. అలాగే అడ్మిన్లు కె.శివశంకర్, జి.నాగలలిత, సి.ధర్మేంద్ర, బి.ముత్యాలయ్య, ఎస్.అపర్ణ, పి.ప్రదీప్, ఎం.శ్రీవాణి, పి.శ్రీహరి, సి.రాజశేఖర్‌కు మెమో జారీ చేశారు.

### వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు



పెనుకొండలో మెడికల్ కళాశాల నిర్మాణాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

పెనుకొండ: వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయం సరికాదని కూటమి ప్రభుత్వానికి మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ సూచించారు. పెనుకొండలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులను బుధవారం సీపీఎం నాయకులతో కలసి ఆయన పరిశీలించి, మాట్లాడారు. వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిలో నిర్వహించాలనుకోవడం అవివేకమన్నారు. 2023లో గత ప్రభుత్వం పెనుకొండలో వైద్య కళాశాల భవన నిర్మాణాలను చేపట్టి రూ. 30 కోట్ల మేర ఖర్చు పెట్టిందని, ఇలాంటి తరుణంలో ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వాల్సిన అవసరం ఏముందని ఆయన ప్రశ్నించారు. వెనుకబడిన ప్రాంతమైన పెనుకొండలో సత్వరం మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేసి తరగతులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పెనుకొండలో మెడికల్ కళాశాల ఏర్పాటైతే సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఉచితంగా అందుబాటులోకి వస్తాయన్నారు. ఇది పేద మధ్యతరగతి వర్గాలకు ఎంతో ఉపయోగకరమన్నారు. అదే ప్రైవేట్ పరమైతే ఫీజుల భారం పడుతుందన్నారు. వైద్య సేవలు అత్యంత ఖరీదుతో కూడుకుంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజావ్యతిరేక విధానాలను వీడి ప్రభుత్వమే మెడికల్ కళాశాలలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గంగాధర్, వెంకటరాముడు, సీఐటీయూ జిల్లా నాయకుడు నాగరాజు పాల్గొన్నారు.

### అలరించిన మలేషియా భక్తులు



సంగీత కచేరీ నిర్వహిస్తున్న మలేషియా భక్తులు

ప్రశాంతి నిలయం: పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తికి చేరుకున్న మలేషియా భక్తులు బుధవారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరీ నిర్వహించారు. అనంతరం మహాసమాధిని దర్శించుకున్నారు.

# ప్రియురాలే మట్టుబెట్టింది!

- వ్యక్తి హత్య కేసులో వీడిన మిస్టరీ
- ఐదుగురి అరెస్ట్



పోలీసులు పట్టుబడిన నిందితులు

అనంతపురం: నగరంలోని రాణినగర్‌లో ఈ నెల 13న చోటు చేసుకున్న హత్య కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. బుధవారం అనంతపురం ఒకటో పట్టణ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను సీఐ జి.వెంకటేశ్వర్లు వెల్లడించారు. అనంతపురంలోని రాణినగర్‌లో నివాసముంటున్న బోయ అంజినమ్మతో బుక్కరాయసముద్రం మండలం పొడరాళ్ల గ్రామానికి చెందిన బోయ చిన్నపెద్దన్న (51) సహజీవనం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆమె దాచుకున్న డబ్బును తరచూ ఇప్పించుకుని తిరిగి ఇవ్వకుండా వేధించేవాడు. దీనికి తోడు విచక్షనా రహితంగా కొట్టి గాయపరిచేవాడు. దీంతో ఎలాగైనా చిన్న పెద్దన్నను శాశ్వతంగా వదలించుకోవాలని నిర్ణయించుకున్న అంజినమ్మ తన కుమారుడు బోయ రమేష్‌తో కలసి పథకం వేసింది. ఇందులో భాగంగా ఈ నెల 13న ఫోన్ చేసి చిన్న పెద్దన్నను ఇంటికి పిలిపించుకుంది. అర్ధరాత్రి సమయంలో రమేష్ అనంతపురంలోని ఒకటో రోడ్డు శివాలయం వద్ద నివాసముంటున్న తన స్నేహితులు పఠాన్ సోహైల్, బోయ మురళీ కార్తీక్, కురుబ శివకుమార్‌ను ఇంటికి పిలుచుకెళ్లి తల్లితో కలసి గ్యాస్ సిలిండర్, చేతికి దొరికిన వస్తువులతో మూకుమ్మడిగా దాడికి తెగబడ్డారు. ఘటనలో చిన్న పెద్దన్న అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం చిన్న పెద్దన్న కుమారుడుకి అంజినమ్మ ఫోన్ చేసి ‘మీ నాన్న చనిపోయాడు’ అని తెలిపి స్విచ్ఛాఫ్ చేసింది. దీంతో హతుడి కుటుంబ సభ్యులు అనంతపురానికి చేరుకునేలోపు అంజినమ్మ, ఆమె కుమారుడు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఘటనపై అనుమానాలు వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబసభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంజినమ్మ, రమేష్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో హత్య చేసిన తీరును వివరించారు. వారిచ్చిన సమాచారంతో పఠాన్ సోహైల్, బోయ మురళీకార్తీక్, కురుబ శివకుమార్‌ను అదుపులోకి తీసుకుని ఐదుగురిపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

### యువతి ఆత్మహత్య



మృతురాలు ఆశ

రాయదుర్గం టౌన్: మండలం మెచ్చిరి గ్రామంలో బుధవారం సాయంత్రం కర్ణాటకకు చెందిన ఆశ(17) ఆత్మహత్య చేసుకుంది. సరిహద్దు కర్ణాటకలోని మొలకాల్మూరు తాలూకా బొమ్మలింగనహళ్లి గ్రామానికి చెందిన మల్లికార్జున, నిర్మల దంపతుల కుమార్తె ఆశ మొలకాల్మూరులో మొదటి సంవత్సరం ఇంటర్ చదువుతోంది. నాలుగు రోజుల క్రితం మెచ్చిరి గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి వచ్చి మేనమామ ఇంట్లో ఉంటోంది. బుధవారం ఉదయం కుటుంబ సభ్యులంతా పొలం పనులకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆశ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై బాధిత తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### రాష్ట్ర స్థాయి ఉషు పోటీలకు గుత్తి విద్యార్థినులు



పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

గుత్తి: స్థానిక కర్నూలు రోడ్డులో ఉన్న జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థునులు 8 మంది రాష్ట్ర స్థాయి ఉషు పోటీలకు ఎంపికయ్యారు. గత మంగళవారం అనంతపురంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో గుత్తి విద్యార్థులు ప్రతిభ చాటి అండర్–17 విభాగానికి ఆరుగురు, అండర్ –19కు ఇద్దరు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఆ పాఠశాలలో విద్యార్థులను హెచ్ఎం సుంకన్న, పీడీలు సరోజ, శ్యామల, లోకేశ్వరి అభినందించారు.

# రైతులను వంచిస్తున్న ప్రభుత్వం

- యూరియాకు రాయితీ అంటూ మభ్యపెడుతోంది
- ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర రెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న చంద్రశేఖర రెడ్డి

అనంతపురం అర్బన్: రైతులకు సరిపడా యూరియాను అందించడం చేతకాని కూటమి ప్రభుత్వం తాజాగా యూరియాకు రాయితీ అంటూ రైతులను వంచనకు గురి చేసే కుట్రకు తెరతీసిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖరరెడ్డి విమర్శించారు. యూరియా వాడకాన్ని తగ్గిస్తే బస్తాకు రూ.800 రాయితీ ఇస్తామని చెబుతూ రైతులను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. అనంతపురంలోని ఆ సంఘం జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం నుంచి రూ.500 కోట్లు దండుకుని రైతులకు యూరియా వాడకాన్ని తగ్గించుకోమంటూ సీఎం చంద్రబాబు చెప్పడం పూర్తిగా రైతు వ్యతిరేక చర్యగానే భావించాల్సి వస్తుందన్నారు. పంటల దిగుబడి తగ్గకుండా ఉండేందుకు రైతులకు అవసరమైన మేర ఎరువులను సరఫరా చేయాల్సిన బాధ్యత నుంచి తప్పుకోవాలని చూడడం సిగ్గు చేటన్నారు. ఉన్నతాధికారులు, అధికారపార్టీ నాయకుల అండతో ఎరువులను బ్లాక్‌మార్కెట్‌కు వ్యాపారులు తరలించడం వల్లనే కొరత ఏర్పడిందన్నారు. యూరియా వాడకంతో క్యాన్సర్ వస్తుందని చెప్పడానికి ఎలాంటి ఆధారాలు లేవన్నారు. ఏ వైద్య పరిశోధనా సంస్థ లేదా శాస్త్రవేత్త ఈ విషయం చెప్పారో వెల్లడించాలని సీఎం చంద్రబాబును డిమాండ్ చేశారు. ఒకవేళ అదే నిజమైతే ఇంతకాలం ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఇప్పుడు ఎరువులు సరఫరా చేయలేక క్యాన్సర్ అని చెబుతూ ప్రజలను భయపెట్టడం చూస్తే ప్రభుత్వ చిత్తశుద్ధినే శంకించాల్సి వస్తోందన్నారు. ఎరువుల సరఫరాకు ఈ–క్రాప్ నమోదుకు ముడి పెడుతున్న ప్రస్తుత తరుణంలో సాగుదార్ల నమోదు పక్కాగా చేయాలన్నారు. కౌలు రైతులను రికార్డు చేయకుండా లింకేజీ నిబంధన అమలు చేస్తే సమస్య మరింత జటిలమవుతుందనే విషయాన్ని గుర్తించాలన్నారు. భవిష్యత్తులో ఎరువులకూ నగదు బదిలీ విధానాన్ని ప్రభుత్వం తెచ్చే ప్రమాదం లేకపోలేదని, ఈ విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### వ్యక్తి బలవన్మరణం



మృతుడు అప్పారెడ్డి

గుత్తి: స్థానిక కురుబ వీధిలో నివాసముంటున్న అప్పారెడ్డి (56) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఆయన రెండు వారాల క్రితం గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ శస్త్రచికిత్స చేయించుకున్నాడు. అప్పటి నుంచి ఆరోగ్యం మదన పడుతుండేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది బుధవారం గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహం వద్ద లభ్యమైన సూసైడ్ నోటును స్వాధీనం చేసుకున్నారు. అందులో తన చావుకు ఎవరూ కారణం కాదని రాసి ఉంది. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## క్లుప్తంగా

### 'ఉపాధి' పనులు నాణ్యతగా చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

రాప్తాడు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను నాణ్యతగా చేపట్టాలని ఎంపీడీఓ బి.విజయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం ఆమె ఉపాధి పనుల కల్పనపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, ఉపాధి పని కావాలని కోరిన ప్రతి కూలీకి పనులు కల్పించాలన్నారు. గ్రామాల్లో ఎక్కువ మంది కూలీలు పనులకు వచ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పనులు కల్పించడంలో ఎవరూ నిర్లక్ష్యం వహించవద్దన్నారు. రైతాంగానికి అనుకూలంగా ఉండే పనులు చేపట్టాలన్నారు. పనులు నాణ్యతగా ఉండేలా చూసుకోవాలన్నారు. పండ్ల తోటల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పనులకు దగ్గర కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సావిత్రి, ఈసీ మురళి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

### ఉదయ్‌భాస్కర్‌కు సత్కారం



ఉదయ్‌భాస్కర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

అనంతపురం: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారిగా బాధ్యతలు నిర్వర్తించి..శ్రీ సత్యసాయి జిల్లా క్రీడా అధికారిగా బదిలీ అయిన ఉదయ్‌భాస్కర్‌ను బుధవారం ఘనంగా సత్కరించారు. నూతన జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి మంజుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కోచ్‌లు దేవమణెమ్మ, సుచేంద్ర, మంజుల, జబీబుల్లా, అనిల్, మహమ్మద్ ఆలీ, సంధ్య, లక్ష్మీదేవి, నరేష్, చలపతి ప్రతాప్, పెద్దక్క, రాఘవేంద్ర, వన్నూరప్ప, భాను తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

అనంతపురం: స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు నిర్వహించారు. ఇందులో జతిన్ కుమార్, అన్వేన ప్రియదర్శిని సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరిని బుధవారం గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతిర్మయి, అకడమిక్ కోఆర్డినేటర్ ఆంజనేయులు, ఆర్చరీ కోచ్ శివకుమార్, పీఈటీ హరీష్ అభినందించారు.

### రక్తదాతలే ప్రాణదాతలు



రక్తదానం చేస్తున్న యువకుడు

అనంతపురం: రక్తదాతలే ప్రాణదాతలు అని జేఎన్‌టీయూ (ఏ) వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు అన్నారు. జేఎన్‌టీయూ (ఏ) ఇంజినీరింగ్ కళాశాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఇండియన్ రెడ్‌క్రాస్ రక్తనిధి జిల్లా శాఖ స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ రక్తదానం సామాజిక బాధ్యతగా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి, ఈసీఈ విభాగాధిపతి, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జీ.మమత, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ కార్యదర్శి మోహన్ కృష్ణ, రక్తనిధి సిబ్బంది జీవన్‌కుమార్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

### కార్పొరేట్ సెలూన్ షాపులు తొలగించాలి

గుంతకల్లుటౌన్: నాయీబ్రాహ్మణుల పొట్ట కొట్టకొడుతూ పట్టణంలో ఏర్పాటు చేసిన కార్పొరేట్ సెలూన్ షాపులను తొలగించే వరకూ పోరాటాలు కొనసాగిస్తామని క్షౌర వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కోశాధికారి బ్రహ్మ తెలిపారు. కార్పొరేట్ సెలూన్‌షాపులు తొలగించాలని కోరుతూ బుధవారం మున్సిపల్ ఆఫీసు వద్ద క్షౌర వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కాటికాపరుల సంఘం రాష్ట్ర నాయకుడు జగ్గిలి రమేష్, సంచార జాతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాసులు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్వామిదాస్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి నాగరాజు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో క్షౌర వృత్తిదారుల సంఘం నాయకులు శివ శంకర్, రంగా, సురేంద్ర, మధు, చరణ్, సాయి, బాలు తదితరులు పాల్గొన్నారు.

# సర్వాంగ సుందరం.. వాసవీ ఆలయం

- 22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు
- ముస్తాబవుతున్న ఆలయాలు





విద్యుత్ దీప కాంతుల నడుమ అనంతపురం కొత్తూరు అమ్మవారిశాల (ఇన్‌సెట్) వాసవీమాత

అనంతపురం కల్చరల్: రాయలసీమలోనే ప్రొద్దుటూరు తర్వాత అత్యంత వైభవంగా జరిగే దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు అనంతపురంలోని వాసవీ మాత ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నాయి.

ఈసారి ఉత్సవాల సందర్భంగా దేశంలోనే ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాల నమూనాలతో అమ్మవారు ప్రత్యేకంగా దర్శనమిస్తారని, ముఖ్యంగా సువర్ణ ప్రభావళిని అమ్మవారికి అలంకరిస్తామని కొత్తూరు అమ్మవారి శాల అధ్యక్షుడు గోపా మచ్చా నసింహులు వెల్లడించారు. 22 నుంచి ప్రారంభమయ్యే శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాలను ఆయన బుధవారం విడుదల చేశారు. ఉత్సవాల సందర్భంగా వాసవీమాతను దర్శించుకునేందుకు విచ్చేసే భక్తులకు అనంతకే ప్రత్యేకమైన పులిహోర ప్రసాదాన్ని తయారు చేయిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా అమ్మవారి శాలను సూచించే ప్రధాన ద్వారం దసరా ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దుతున్నామన్నారు.



దసరా ఉత్సవాల కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

**అలంకార సేవలు ఇలా..**

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల అలంకరణ కోసం తమిళనాడు రాష్ట్రంలోని సేలంతో పాటు హైదరాబాద్, గుంటూరు నుంచి కళాకారులను రప్పించారు. ఈ నెల 22 నుంచి వచ్చేనెల 2 వరకు సాగే ఉత్సవాల్లో తొలిరోజు అన్నపూర్ణ మహాశివుడి అలంకారంలో వాసవీ మాత దర్శనమిస్తుంది. 23న అనంత పద్మనాభుడిగా, 24న రాజరాజేశ్వరిగా, 25న ఆట్రుకల్ భగవతి అమ్మాన్‌గా, 26న పద్మనిధి కుబేరలక్ష్మిగా, 27న కుబేరలక్ష్మిగా, 28న గరుడ వెంకటలక్ష్మి నారాయణన్ అమ్మాళ్‌గా, 29న రేణుక, సరస్వతి, మధురమీనాక్షి అమ్మవార్లుగా, 30న అష్టలక్ష్ముల రూపాల్లో వాసవీమాత, వచ్చేనెల 1న కలకత్తా కాళీ మాతను తలపించే మహిషాసుర మర్దినిగా, 2న విజయదశమి సందర్భంగా వారాహిమాత విశ్వరూపదర్శనంలో భక్తులకు దర్శనమిస్తారు.

## మహిళలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ నాగమణి

ఆత్మకూరు: మహిళలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డాక్టర్ భార్గవి సూచించారు. బుధవారం స్థానిక ఆసుపత్రిలో 'స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ... మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం అంతా బాగుంటుందన్నారు. అందువల్ల అందరూ మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా పలువురు మహిళలకు గర్భాశయ, రొమ్ము కేన్సర్‌లకు సంబంధించిన పరీక్షలు చేస్తున్నామని, అనుమానిత కేసులను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 2వ తేదీ వరకూ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ తదితర పరీక్షలను చేసి అవసరమైన వారికి మందులను అందజేశారు. పౌష్టికాహారం తీసుకోవాలని, దీనివల్ల సుఖప్రసవం కావడంతో పాటు శిశువు కూడా సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటుందని డాక్టర్ భార్గవి గర్భిణులకు సూచించారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.

**మహిళల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి**

రాప్తాడు: స్త్రీ ఆరోగ్యంగా ఉంటే... ఆ కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుందని, అందువల్ల ప్రతి ఒక్కరూ మహిళల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఐసీడీఎస్ పీడీ నాగమణి సూచించారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు శివకృష్ణ, శ్రావణి ఆధ్వర్యంలో 'ఆరోగ్యవంతమైన స్త్రీ-శక్తివంతమైన కుటుంబం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టాయన్నారు. స్టేట్ అబ్జర్వర్, జోనల్ మలేరియా అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, కమ్యూనిటీ ఆస్పత్రుల్లో 15 రోజుల పాటు మహిళలకు వైద్య పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన మందులు అందిస్తామన్నారు. అనంతరం దాదాపుగా 100 మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కన్సలెంట్ డాక్టర్ హేమంత్, నోడల్ ఆఫీసర్ సుమన గోపిచంద్, విష్ణు, సీడీపీఓ ఉమాశంకరమ్మ, ఏఓ భానురేఖ, ఎంఈఓ కుల్లాయప్ప, సీహెచ్ఓ శివ ప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్లు అరుణ, నరసింహ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హేమతల, నాగరత్న తదితరులు పాల్గొన్నారు.

## అట్రాసిటీ చట్ట పరిరక్షణకు 25న ధర్నా



ధర్నా కరపత్రాలు విడుదల చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

అనంతపురం అర్బన్: ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం పరిరక్షణకు కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 25న విజయవాడలో ధర్నా నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప తెలిపారు. బుధవారం నగరంలోని కేవీపీఎస్ కార్యాలయంలో ధర్నా కరపత్రాలను నాయకులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా నల్లప్ప మాట్లాడుతూ 16 నెలలుగా జిల్లాలో దళితులపై దాడులు, అత్యాచారాలు, దౌర్జన్యాలు పెరిగాయన్నారు. రక్షణగా ఉన్న అత్యాచార నిరోధక చట్టాన్ని సక్రమంగా అమలు చేయకపోగా.. కేసుల నిర్వీర్యానికి, దళితులపై మానసిక దాడికి పోలీసు యంత్రాంగం పూనుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో చట్టాన్ని రక్షించాలని, 41 నోటీసు పేరుతో స్టేషన్ బెయిల్ ఇవ్వరాదని, పరిహారం ఇవ్వాలని కోరుతూ ధర్నా చేపట్టనున్నామని చెప్పారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, నగర అధ్యక్షుడు జీవరత్నం, నాయకులు నాగేంద్ర, ఆంజనేయులు, పుల్లన్న, తదితరులు పాల్గొన్నారు.

### జగన్‌ను కలిసిన 'వెన్నపూస'



అనంతపురం కార్పొరేషన్: తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ అనుబంధ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రరెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

### క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ప్రతిభ



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో వీసీ సుదర్శనరావు తదితరులు

అనంతపురం: క్యాంపస్ ఇంటర్వ్యూల్లో జేఎన్‌టీయూ (ఏ) విద్యార్థులు ప్రతిభ చాటారు. మోషిప్ టెక్నాలజీస్ కంపెనీలో ఉద్యోగాలకు నలుగురు విద్యార్థులు (రూ.6లక్షల వార్షిక వేతనం), డెల్టా ఎక్స్‌లో ఒక విద్యార్థి (రూ.7 లక్షల వార్షిక వేతనం), ఇన్ఫోసిస్ కంపెనీలో ఒక విద్యార్థి (రూ.6.25 లక్షల వార్షికవేతనంతో) ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.వసుంధర అభినందించారు.

## పోటీ పరీక్షల్లో ఎస్కేయూ విద్యార్థుల సత్తా



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి. అనిత

అనంతపురం: పోటీ పరీక్షల్లో ఎస్కేయూ విద్యార్థులు సత్తా చాటుతున్నారని ఇన్‌చార్జ్ వీసీ బి.అనిత పేర్కొన్నారు. ఇటీవల డీఎస్సీ, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల్లో పలువురు విద్యార్థులు అర్హత సాధించారు. ఈ సందర్భంగా బీఈడీ కళాశాలలో విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ అనిత మాట్లాడారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటి, గణనీయంగా కొలువులు సాధిస్తారనే రికార్డును నిలబెట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ జి.వెంకటనాయుడు, ప్రిన్సిపాల్ డాక్టర్ సోమశేఖర్, సూపరింటెండెంట్ ఎంఏ లక్ష్మణరావు, బీఈడీ ఫ్యాకల్టీ డాక్టర్ రాముడు, డాక్టర్ అనిత, డాక్టర్ శివానంద, డాక్టర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



పోషణ మాసంపై ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



పోషణ మాసోత్సవాల్లో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, ఎంపీపీ వరలక్ష్మి

అనంతపురం సెంట్రల్: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఐసీడీఎస్ అర్బన్ సీడీపీఓ అనురాధ సూచించారు. 8వ రాష్ట్రీయ పోషణ మాసంలో భాగంగా రామ్‌నగర్-3 అంగన్‌వాడీ కేంద్రంలో కార్యక్రమం నిర్వహించారు. తొలుత కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని అక్టోబర్ 16 వరకూ పోషణ మాసం నిర్వహిస్తున్నట్లు వివరించారు. గర్భిణులు, బాలింతలకు పోషణ, ఆహార వైవిధ్యంగా పోషక విలువలతో ఆహారం ఎలా చేసుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడీ వర్కర్లు ఎ.సంధ్య, జమున, ఖాసీంబీ, సౌజన్య, షర్మిల తదితరులు పాల్గొన్నారు.

**కురుగుంటలో పోషణ మాసోత్సవాలు**

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కురుగుంట పీహెచ్‌సీలో బుధవారం పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, ఇతర తల్లులతో సమావేశం ఏర్పాటు చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్, ఎంపీపీ వరలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు రోజూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి, మెడికల్ ఆఫీసర్ మనోజ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఝాన్సీరాణి, లీలావతి, భారతి, జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు శిరీష, రత్నమ్మ, విజయలక్ష్మి, ఆయాలు పాల్గొన్నారు.

**పౌష్టికాహారంతో కూడిన భోజనం వడ్డించాలి**

ఆత్మకూరు: విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం వడ్డించాలని ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజినేయులు సూచించారు. బుధవారం వారు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనానికి తాజా కూరగాయలు వాడాలని, పదార్థాలన్నీ రుచికరంగా ఉండాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన భోజనాన్ని ఎంఈఓలు రుచి చూశారు. అనంతరం పాఠశాలలోని వివిధ రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం తగ్గకూడదని, ప్రతి సబ్జెక్టు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని తెలియజేశారు.

## అర్చకుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దేవదాయ శాఖ సహాయ కమిషనర్

అనంతపురం కల్చరల్: అర్చకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అర్చక సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షులు వైపీ ఆంజనేయులు నేతృత్వంలో పలుప్రాంతాల నుండి విచ్చేసిన అర్చకులు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నగరంలోని మొదటిరోడ్డు శివాలయంలో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో అర్చకుల డెత్ గ్రాట్యుటీ ఫైల్స్ కదలడం లేదని, దూపదీపనైవేద్య పథకాలు చాలా ఆలయాలకు వర్తింపజేయడం లేదని, అర్చకుల ఐడెంటిటీ కార్డుల మంజూరులో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందని అన్నారు. ధార్మిక పరిషత్ నుంచి వచ్చే పడితరం తీసుకుంటున్న అర్చకులకు 'తల్లికి వందనం' పడడం లేదని, ఎండోమెంటు అధికారులు సమస్యలను మానవతాదృష్టితో చూసి పరిష్కరించాలని కోరారు. ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన దేవదాయ శాఖ సహాయ కమిషనర్ తిరుమలరెడ్డి, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వన్నూరుస్వామి మాట్లాడుతూ మన భూములను మనం కాపాడుకోవడానికి కృషి చేద్దామని, అర్చకుల సమస్యలను వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అర్చకులకు సత్కారాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అర్చక సమాఖ్య నాయకులు రవికుమార్, మారుతీప్రసాద్, వెంకటగిరి, తిరుపతయ్య, చంద్ర, మల్లికార్జున, వేణుగోపాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్యం, భద్రతపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న డాక్టర్ ప్రసూన

అనంతపురం ఎడ్యుకేషన్: మహిళలు ఆరోగ్యం, భద్రతపై దృష్టిపెట్టాలని వక్తలు పేర్కొన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 16వ రాష్ట్ర మహాసభల సందర్భంగా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో సెమినార్ నిర్వహించారు. మహిళల మెంటల్ హెల్త్, ఫిజికల్ గురించి, డిజిటల్ ప్లాట్‌ఫాంలలో జాగ్రత్తలు, ఆత్మహత్య ప్రేరేపిత ఆలోచనను అరికట్టడం గురించి డాక్టర్ ప్రసూన, డాక్టర్ నాగజ్యోతి, డాక్టర్ విశ్వనాథ్ రెడ్డి, డాక్టర్ పల్లవి వివరించారు. ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కాలేజ్ సెక్రటరీ డాక్టర్ నిర్మలమ్మ మాట్లాడుతూ సొసైటీలో ఆడపిల్లలు చాలా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఐద్వా 16వ రాష్ట్ర మహాసభలు అక్టోబర్ 13,14,15 తేదీల్లో జరుగుతున్న నేపథ్యంలో సాంస్కృతిక ఉత్సవాలు అక్టోబర్ 9, 10, 11 తేదీలలో కృష్ణ కళామందిర్ లో జరుగుతాయని ఐద్వా పట్టణ కార్యదర్శి అశ్విని తెలిపారు.

## ప్రతి మహిళకూ మెరుగైన వైద్యం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం మెడికల్: ప్రతి మహిళకూ మెరుగైన వైద్యం అందించాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సూచించారు. బుధవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' కార్యమాన్ని ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' నిర్వహిస్తున్నాయన్నారు. డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రాథమిక కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, తదితర వాటిలో వచ్చే నెల 2 వరకు మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎల్ సుబ్రమణ్యం, అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి, డీఐఓ డాక్టర్ యుగంధర్, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

**ఎంపీ అడ్డగింత:**

సర్వజనాస్పత్రికి వచ్చిన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను పారిశుద్ధ్య కార్మికులు అడ్డుకున్నారు. ఖాళీ ప్లేట్లతో నిరసన తెలిపారు. మూడు నెలలుగా వేతనాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలందించేలా చర్యలు తీసుకుంటానని పారిశుద్ధ్య కార్మికులకు ఎంపీ హామీ ఇచ్చారు.

### నేడు నీటి సరఫరాకు అంతరాయం

అనంతపురం కార్పొరేషన్: పీఏబీఆర్ నుంచి అనంతపురం నగరానికి నీటిని సరఫరా చేసే పైప్‌లైన్ లీకేజీ కారణంగా గురువారం నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

### యోగా గురువుకు 'విజన్' అవార్డు

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన యోగా గురువు ఎంబీ మహేష్‌బాబు విజన్ ఆఫ్ భారత్ అవార్డు అందుకున్నారు. ప్రధాన మంత్రి 75వ జన్మదినం సందర్భంగా స్టార్ ఇంటర్నేషనల్, వర్తి వెల్నెస్ ఫౌండేషన్ వారు దేశవ్యాప్తంగా వివిధ రంగాలలో సేవలందిస్తున్న వారికి అవార్డులు అందించారు. ఇందులో భాగంగా మహేష్‌బాబుకు పోస్ట్ ద్వారా అవార్డు పంపారు.

### 'ఎంపీఆర్ గేట్లకు మరమ్మతు చేయాలి'

గార్లదిన్నె: మండలంలోని ఎంపీఆర్ గేట్లకు మరమ్మతులు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నప్ప యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని 'ప్రసాద్ భవనం'లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపీఆర్ గేట్ల వద్ద నీరు లీకేజవుతోందన్నారు. ప్రభుత్వం కనీసం డ్యాం గేట్లు మరమ్మత్తులు చేయకపోవడం దారుణమన్నారు. లీకేజీ వల్ల నీరు వృథా అవుతున్న కాంట్రాక్టర్లు, అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం వెంటనే డ్యాం గేట్లకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు శ్రీనాథ్, సీపీఐ మండల కార్యదర్శి రాముడు, శింగనమల మండల కార్యదర్శి మధు, తదితరులు పాల్గొన్నారు.

### టమాట ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలి



టమాటాను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

రాప్తాడురూరల్: జిల్లాలో టమాట ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం (సీపీఐ అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున డిమాండ్ చేశారు. బుధవారం అనంతపురం రూరల్ పరిధిలోని కక్కలపల్లి టమాట మార్కెట్టును రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా చిరుతల మల్లికార్జున మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువ శాతం రైతులు టమాటాపై ఆధారపడ్డారన్నారు. ఎక్కువ దిగుబడి ఉండడంతో గిట్టుబాటు ధర లేక అల్లాడి పోతున్నారన్నారు. పంటను మార్కెట్‌కు తీసుకువచ్చినప్పుడు దళారులు గ్రూపుగా ఏర్పడి వారు నిర్ణయించినటు వంటి రేటును వేలం పాడేలా మాట్లాడుకుని రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. జిల్లాలో జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని కొంతకాలంగా కోరుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల పట్ల కపట ప్రేమ చూపిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు రామకృష్ణ, జి.శ్రీకాంత్, సీపీఐ అనంతపురం రూరల్ మండల కార్యదర్శి జి నరేష్, రెడ్డప్ప, అక్కులన్న, కుళ్లాయప్ప పాల్గొన్నారు.